# లజ్ కార్నర్

★

## శ్రీమతి మాలతీ చందూర్

రాత్రి పదిగంటలు కొట్టారు. శేఖరం అప్పుడే నడుం వాల్చాడు. కాస్త కునుకు పట్టిందో లేదో హాల్లోని టెలిఫోన్ గణగణ మోగింది. శేఖరానికి చిర్రెత్తుకొచ్చింది. విననట్టు వూరుకున్నాడు. కాని ఆ ఫోను చేసే మహానుభావుడు—యివతలవారి అంతూ పంతూ తేల్చుకునేట్టు వున్నాడు.

ఫోనుదగ్గిర కెళ్లి రిసీవర్ చేతబుచ్చుకున్నాడు శేఖరం. 'హల్లో' అని అవతలవైపునుంచి స్త్రీ కంఠం వినపడటంతో—అతని నిద్రమత్తు వదిలింది. కాని యింత రాత్రివేళ తనకు ఫోనుచేసే స్త్రీ ఎవరా అని ఆశ్చర్యపడ్డాడు. 'హల్లో' అన్నాడు సమాధానంగా.

'మీ ఉత్తరం నిన్ననే అందింది. ఎక్స్‌ప్రెస్ లేటయింది. అంచేత చిక్కుపడిపోయాను.' అంటోంది స్త్రీకంఠం.

తనేమిటి, వుత్తరం రాయడమేమిటి, ఎక్స్‌ప్రెస్ ఏమిటి? పైగా చిక్కుపడిపోవడం ఏమిటి? ఇందులో ఏదో పొరబాటు వుండివుండాలి, అనుకుంటూ 'ప్లీజ్ - మీపేరు?' అన్నాడు శేఖరం.

'శ్యామల. మీ ఎడ్రసు పారేసుకున్నాను, కాని ఫోన్ నెంబరుమటుకు జ్ఞాపకంవుంది. నేనిక్కడ చాలా ఆక్వర్డ్ సిట్యూయేషన్‌లో చిక్కుకున్నాను.'

'మీరు ఒక నెంబరుకు మరో నెంబరు ఫోన్ చేసివుంటారు. నేను మీకు వుత్తరం ఏమీ రాయలేదు. మీకు కావలసిన నెంబరేమిటి?'

'మీ నెంబరు 2017 కాదా? అది మీరిచ్చిన నెంబరే. శ్రమ అనుకోకుండా తక్షణంవచ్చి నన్ను తీసుకెళ్ళండి. అసహాయ స్థితిలో వున్నాను,' అంది అవతల కంఠం.

'మీరేదో పొరబడుతున్నారు. మీరు డయల్ చేసింది 2017 కాదు, 2007. రాంగ్ నెంబరు' ఫోను కిందబెట్టబోతున్నాడు శేఖరం.

'దయచేసి—నే చెప్పేది వినండి. ఫోను కిందపెట్టెయ్యకండి. మీరు డైరెక్టర్ ఆనందన్ కదూ? ఆయన నన్ను రమ్మనమని వుత్తరం రాశారు. అది చూసుకుని పొద్దుటే బయలుదేరాను బెజవాడనుంచి. చూడండి నాదగ్గిర చిల్లరలేదు, నోట్లున్నాయి. పబ్లిక్ టెలిఫోన్‌నుంచి మీకు ఫోన్ చేస్తున్నాను,' అంది శ్యామల.

'అయితే?' అన్నాడు శేఖరం కొంటెగా.

'మిమ్మల్నిశ్రమపెడ్తున్నందుకు క్షమించండి. దయచేసి, 2007 నెంబరుకి ఫోన్‌చేసి, శ్యామల ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిందనీ లజ్ కార్నర్‌లో చిక్కుపడిందనీ ఆనందన్ గారికి ఫోన్‌చేసి పెట్టరూ?'

'మీరే ఫోన్‌చేసుకోండి. మధ్య నేనెందుకు?' అంటూ రిసీవరు కిందబెట్టబోతుంటే...

'నామాట నమ్మరూ—దగ్గిర నోట్లున్నాయిగాని—పర్సులో చిల్లరలేదు. రెండు అణాబిళ్ళలుంటేగాని టెలిఫోన్ పలకదుగా—దయచేసి... నాకు చాలా భయంగావుంది. వీధంతా నిర్మానుష్యంగా వుంది. నేను ఈ బాక్సులోవున్నాను. బయట ఎవరో అతను నావంక ఎలాగో చూస్తున్నాడు. నాకు ఏమిటో భయంగావుంది—నేనిక్కణ్ణించి కదలటానికి భయంగా వుంది. మీరన్నావచ్చి నన్నిక్కడినుంచి రక్షించండి.'

డైరెక్టర్ ఆనంద్ గారికి ఫోన్‌చేశాడు శేఖరం.

'చూడండి శ్యామలాదేవిట మీరు వుత్తరం రాశారుట. బెజవాడనుంచి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిందట. లజ్ కార్నర్‌లోని పబ్లిక్ టెలిఫోన్‌నించి

ఫోనుచేసింది. ఆవిడదగ్గిర—మీకు ఫోనుచేసేందుకు అణాలు లేవట. ఆవిడకు చాలా భయంగా వుందిట. మిమ్మల్ని వెంటనేవచ్చి తీసుకెళ్ళమంటోంది. మీరొచ్చేదాకా అక్కడే వుంటుందిట," అన్నాడు. గుక్క తిప్పుకోకుండా శేఖరం.

'డైరెక్టరుగారు నిద్దరపోతున్నారు. ఇప్పుడు లేపకూడదు.'

శేఖరం ఆశ్చర్యపోయి "మరి మీ రెవరు?" అని అడిగాడు.

'మేనేజర్ని—'

'ఆ శ్యామలాదేవి సంగతేమిటి?'


'మాకేమి తెలుసును, సార్? ఎందరో వస్తా వుంటారు పోతూవుంటారు.'

'ఓరిదౌర్భాగ్యుడా!' అని మేనేజర్ని మనసులో తిట్టుకుంటూ శేఖరం గరాజ్ లోనుంచి కారుతీసి లజ్ కార్నరు వైపుకి బయలుదేరాడు.

ఆ వచ్చినఅమ్మాయికి కొంచెం యింగితం వుండ రాదూ? రాత్రి పదిగంటలవేళ, వొక్కర్తే ఆడపిల్ల, ఎరగని పరాయివూళ్లో చిక్కుపడిపోతేమా? బయలుదేరేముందు కొంచెం మంచీచెడ్డా ఆలోచించడం అనేది ఆడవాళ్లకి బొత్తిగావుండదు కాబోలు. ఇప్పుడు ఏడుపులూ, మొత్తుకోడాలూ. యీ సినిమా వేలంవెర్రి ఆడపిల్లల్ని భూతంలా పట్టుకుని పీడిస్తోంది.

ఆ అమ్మాయికి శాస్తి జరగాల్సిందే! పాపం, ఆడపిల్ల ఆశ్రయంలేకుండా తెల్లవార్లూ గడపగలదా? ఏహోటల్ కైనా పోగూడదూ పర్సులో నోట్లువున్న అమ్మాయి? లోకజ్ఞానం తెలియని మూఢురాలిలా వుంది ఈ శ్యామల. లేకపోతే అర్ధరాత్రివేళ...... ఛెట్, జారిపడగూడదు. యిలాటి పిల్లలకి శాస్తిజరగవలసిందే—అనుకుంటూ లజ్ కార్నర్ లో కారు ఆపాడు శేఖరం. కారు దిగి రెండడుగులు ముందుకి వేశాడు శేఖరం. అచ్చు ఆ అమ్మాయి చెప్పినట్టే, ఆ బాక్సుదగ్గిర ఒక మనిషి నుల్చుని లోపలికి చూస్తున్నాడు. పెట్టెలోపల శ్యామలాదేవి వుంది.

శేఖరం తలుపు తెరవబోయే టప్పటికి, ఆ అమ్మాయి పిచ్చికేకవేసి అరవడం మొదలుపెట్టింది. శేఖరం కొంచెం గాభరాపడ్డాడు. ఏదో పుణ్యానికి పోతే పాపంచుట్టుకున్నట్టుందనుకున్నాడు. ఏదో ఆడపిల్లగదా సాయంజేద్దామనివస్తే, అలా గావుకేక



లెందుకు? అవును, తనతో ఫోనులో మాట్లాడింది గాని తనెవరో ఆ అమ్మాయికి ఏం తెలుసు?

'నేను శేఖరాన్ని' అన్నాడు.

ఆ అమ్మాయి మరీ గట్టిగా యింకో కేక వేసింది.

దారినిపోయే కానిస్టేబులూ, పక్కనున్న రిక్షావాళ్లూ, టాక్సీడ్రయివర్లూ, టెలిఫోన్ బాక్సుకి దగ్గిరసా నుంచుని యిందాకటినుంచి శ్యామలని భయపెడుతున్న అ పెద్దమనిషీ, అంతా గుమిగూడి రొద చెయ్యడం మొదలెట్టారు.

కానిస్టేబులు ముందుకొచ్చి 'ఏన్నా సార్ గలాటా?' అన్నాడు, శేఖరంవంక అనుమానంగా చూస్తూ.

శేఖరానికి వొళ్ళుమండిపోతోంది. హాయిగా నిద్దరపోతున్న తనకి నిద్రాభంగం చేసి, బతిమిలాడిన యీ మనిషి—యింత హడావుడి చేస్తుందా? ఎవరి ఖర్మంవాళ్ళది అనుకుని వెనక్కి తిరగబోయే వేళకి శ్యామలబాక్సులోంచి బయటకివస్తూ 'మీరు 2007?' అంది.

'సమాచారం ఏన్నా?' అన్నాడు కానిస్టేబులు యీ భాషని అర్థంచేసుకోలేక.

'అవును—2007 ని—' అన్నాడు శేఖరం శ్యామలతో.

'మీరా—మీరనుకోలేదు. బయట నుల్చున్న పోకిరీ తాలూకు మనిషేమో ననుకున్నాను. అందుకే భయంవేసి అరిచాను,' అంది శ్యామల కాస్త తెప్పరిల్లి.

'నేను—శేఖరాన్ని అని చెప్తున్నా వినిపించుకోకుండా అరుపులు మొదలెట్టేరి!' అన్నాడు శేఖరం.

'నా పేరు మీరు అడిగారుగాని—మీ పేరు నేను అడగలేదు. అంచేత ఎవరో అనుకున్నా,' అంది శ్యామల.

'మీరేనా—యీ అమ్మాయిని వెంటాడుతున్నది. పాపం! భయపడిపోయింది,' అన్నాడు శేఖరం యిందాకటినుంచి 'బాక్సు'ని ఆనుకు నుల్చున్న మనిషితో.

ఆయన ఆశ్చర్యంతో బిగ్గరగా నవ్వి 'బాగుంది. యిది చాలా బాగుంది. మా ఆవిడకి నెప్పులు వచ్చేట్టున్నాయంటే, డాక్టరుకి ఫోనుచేద్దామని వచ్చాను. యీ అమ్మాయి ఆ పెట్టెలో దూరి, ఎంతసేపటికీ రాదాయెను. పావుగంటయింది, అరగంటయింది. బయటికి రాదు. నేనసలే ఖంగారుతో సతమతమౌతుంటే, యీ అమ్మాయిని అల్లరి పెట్టడమూ! బాగుందండోయ్ బాగుంది. మా పెద్దామ్మాయి యీ పిల్ల యీడుదే,' అన్నాడు ఆ పెద్దమనిషి.

అందరితోపాటు కష్టంలోవున్న శ్యామలకి కూడా నవ్వు వచ్చింది.

'డైరక్టరుగారికి నిద్రాభంగం గావించకూడదని వారి మేనేజరుగారు మనవి చేశారు—నువ్వు—క్షమించండి—మీరు ఏం చెయ్యదల్చుకున్నారు?"

'ఏహోటలులోనన్నా యీ రాత్రి గడిపి, పొద్దుట డైరెక్టరుని కలుసుకుంటా,' అంది శ్యామల.

'ఏ హోటలులోనైనా మీకు తెలిసినవాళ్లున్నారా? అదీకాక పదిన్నర అయింది. మిమ్మల్ని ఎక్కడో అక్కడ దించి యింటికి పోతాను. సామాను ఏమీ లేదా?'

'వెనకనుంచి వస్తుంది.'

'అలాగా?' అని వెటకారం చేశాడు శేఖరం. ఆడవాళ్ళ హోస్టలు గేట్లు యీ వేళప్పుడు తెరిచి వుంచుతారా? ఆమె చేతిలో చిన్న తోలుసంచి ఒకటి వున్నది. అందులో ఒక చీర, జాకెట్టూ వున్నాయి కాబోలు.

కారు కదలబోయేముందు కానిస్టేబులు శేఖరానికీ విష్ చేసి 'నీకేం భయంలేదమ్మా,' అన్నాడు, శ్యామలకి ధయిర్యం చెబుతూ.

'భయమెందుకు? ఆవిడ కేకవేస్తే రెండు మైళ్ళ దాకా వినిపిస్తుంది,' అన్నాడు శేఖరం. ఆ మాటలతో శ్యామలకి వుడుకుమోత్తనం వచ్చింది.

కారు పరుగెడ్తోంది. వెన్నెట్లో శేఖరం శ్యామలని కనుకొలకుల్లోంచి పరిశీలిస్తున్నాడు. సన్నగా పొడుగ్గావుంది శ్యామల. కట్టూ బొట్టూ తీరులో నాగరికతా, మర్యాదలతో ణాలు వుట్టిపడుతున్నాయి. జరీఅంచు పట్టుచీరె కట్టుకుంది. ఒక చేతికి నాలుగు బంగారుగాజులూ, మరో చేతికి రిస్టువాచీ, మెళ్లో నూడుపేటల గొలుసూ వున్నాయి. పమిట నిండుగా రెండు బుజాలు కప్పేటట్లు వేసుకుంది. చేతికి ఒక ఆకుపచ్చరాయి వుంగరం, చెవులకి ముత్యాల దుద్దులు. మనిషి పసిమి కాకపోయినా చామంచాయకంటే, ఒక చాయ ఎక్కువ అని చెప్పవచ్చు. కళ్ళు మటుకు సోగదేలి, బెదిరిన లేడికళ్లలా, వున్నాయి. ఆ రాత్రి సంఘటనవల్లనో, లేక స్వతస్సిద్ధంగా ఆ కళ్ళు అలా వుంటాయో అంతుపట్టలేదు శేఖరానికి. గడ్డం కోసుగా గర్వంగా వున్నట్టుండి చూడటానికి. నుదురు విశాలమైనది కాకపోయినా తీర్చిదిద్దినట్లుగా వుంది. వేషభాషల్ని బట్టి శ్యామల వున్నతమైన కుటుంబంలోంచి వచ్చినట్టు గ్రహించుకున్నాడు శేఖరం.

రోడ్డు మలుపు తిరిగింది. శేఖరం కారు కాస్త స్లో జేశాడు. ఇంతవరకూ ఆకాశంలోకి చూస్తున్న శ్యామల భయంగా అతనివైపు తలతిప్పింది. 'భయపడకు. నేను రాక్షసుణ్ణి కాదులే. చూడు యీ అర్ధరాత్రివేళ నిన్ను ఏం చెయ్యాలో నాకు తోచకుండా వుంది. అప్పుడే పదకొండు దాటిందా! యీ వూళ్లో నీకు తెలిసినవారు గాని చుట్టాలు గాని లేరా?' అన్నాడు శేఖరం.

'ఉన్నారు. కాని వాళ్లదగ్గిరకు వెళ్లడం యిష్టం లేదు. శ్రమ అనుకోకపోతే యీ రాత్రికి, ఏ హోటల్లోనన్నా, నన్ను వుంచండి, రూమ్ తీసుకుని వుంటాను. పొద్దుటే డైరెక్టరుగార్ని కలుసుకుని, ఆపైన నా తిప్పలు నేను పడతాను,' అంది శ్యామల.

'ఇదుగో చూడు. నువ్వు కాస్తో కూస్తో చదువుకున్నట్టున్నావు. యీ రాత్రివేళ నిన్ను ఒక్కర్తెనూ ఏ హోటల్లో దిగవిడచను? నువ్వు వొంటిగా హోటల్‌లో ఎప్పుడైనా వున్నావా? పోనీ, మా యింటికి రారాదూ?' అన్నాడు శేఖరం.

శ్యామల భయంభయంగా చూసింది అతని వంక. అతనికి నిజంగా కోపం వచ్చింది ఈసారి. యీ అమ్మాయి ప్రతి మొగాణ్ణీ అనుమానంతో ఎందుకు చూడాలి?

'ఇదుగో అమ్మాయి, నే నేదో మనసులో పెట్టుకుని నిన్ను మా యింటికి పట్టుకెళ్తున్నా ననుకోకు. నేను వొంటిగాణ్ణి కాదు. యింట్లో మా అమ్మ వుంది. నువ్వు యిక్కడా అక్కడా యీ రాత్రి గడపడం బదులు మా యింట్లో వుండటం మంచిదని చెప్పాను. నా మాట అబద్ధం అయితే, నీ ఆయుధం నీకుందిగా. మా పేటంతా హడిలిపోయి లేస్తారు నువ్వు కేక పెట్టావంటే!' అన్నాడు శేఖరం.

'మీ అమ్మగారు యీ అర్ధరాత్రి నన్ను చూసి ఏమన్నా అనుకుంటారేమో?' అంది శ్యామల.

'నిన్ను గురించి ఏమన్నా అనుకుంటారేమో గాని నన్ను గురించి ఏమీ అనుకోరు. అదీగాక తెల్లారేదాకా నిన్ను యిల్లా కార్లో తిప్పేటంత స్పోర్ట్‌ని కాను నేను. అయినా సినిమాల్లో చేరదల్చుకున్న మనిషివి, యీలాటి అనుమానాలు పెట్టుకుంటే పెద్ద స్టారువి కావడం కష్టం,' అన్నాడు శేఖరం వెక్కిరింపుగా.

శ్యామల ముఖం తిప్పుకు కూచుంది. కాని శేఖరానికి ఆవిడ కన్నీరు కారుస్తోందని తెలుసు.

'ఏమిటి మా యింటి కొస్తావా? లేదా?' అన్నాడు.

'వూ'—అంది శ్యామల ముఖం తిప్పుకోని.

'అయితే నేను అడిగే ప్రశ్నలు కొన్నింటికి సమాధానాలు చెప్పు,' అన్నాడు శేఖర్ కటువుగా.

శ్యామల మొఖం తిప్పుకుని రుమాలుతో కళ్లు తుడుచుకుంది.

'ఏం చదువుకున్నావ్?'

'ఇంటరు పరీక్షకు వెళ్ళాను.'

'రిజల్ట్సు తెలియకుండా నే కళాసేవకి ప్రారంభించావన్నమాట, బాగుంది! మీ దేవూరు, మీ నాన్నగారు—యీ సంగతులు కాస్త చెప్పు.'

'మా వూరు బెజవాడ. చీకట్లో మైలు ఎక్కేందుకు భయం వేసి, పొద్దుట బయలుదేరి, వెలుతురు వుండగా నాలుగు అయిదింటికల్లా యీ వూరు వస్తుంది గదా అని ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. నా దురదృష్టం కొద్దీ అది లేటు అయింది. మిమ్మల్ని యిబ్బంది పెట్టాల్సి వచ్చింది,' అంది శ్యామల.

'మీ నాన్నగారిమాట చెప్పావు కాదు.'

'ఆయన గవర్నమెంటు ఆఫీసరు. నేను పెద్దమ్మాయిని. యింకా చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ వున్నారు.'

'పేరు? వుద్యోగం?'

'ఇప్పుడు చెప్పను. తర్వాత చెపుతాను.'

'అయితే, యింట్లో చెప్పకుండా కళాసేవకి వచ్చావన్నమాట. అసలు యిక్కడి కష్టసుఖాలు తెలియకుండా తొందరబడి రావడం తెలివిగలవాళ్ళ లక్షణం కాదు. అయినా నాకెందు కాగొడవ? రేపటినుంచీ కళాసేవ ప్రారంభిస్తావన్నమాట?'

'ఇదుగో చూడండి. నా బుద్ధి పొరబాటుకొద్దీ తప్పు నెంబరు డయిల్ చేశాను. అది నా గ్రహచారం కాకపోతే, ఆ తప్పు నెంబరు మీదే కావాలీ? నేను రాత్రిపూట నిస్సహాయపరిస్థితుల్లో చిక్కుకోడం తప్పని, మీరు కనీసం ఒక వందసార్లన్నా మాటల్లో భావాల్లో వ్యక్తంచేశారు. మీ లెక్చర్లు వినడం కంటె, యిలా యీ రాత్రి చెట్టుకింద గడపడం నయం. కారు ఆపండి. నాదారి నేను పోతాను. మీదారిన మీరు పోదురుగాని,' అంది శ్యామల వుడుకుమోతనం భరించలేక.

కారు పోర్టికోలో ఆగాక, శేఖరం తల్లి తలుపు తీసింది. శేఖరం శ్యామలని తల్లికి పరిచయంచేసి, కారు గరాజ్‌లో పెట్టేందుకు వెళ్ళాడు.

* * * *

శేఖరం తల్లికి యాభైఏళ్ళుంటాయి. కాని చూపులకి అరవైఏళ్ళ మనిషిలా కనపడుతుంది. మనిషి పీలగా, తెల్లగా వుంటుంది. ఆవిడ ముఖంచూస్తే వయసులో చాలా అందంగా వుండివుంటుం దనిపిస్తుంది. కొడుకంటె ఆమెకు అమితమైన ప్రేమ. ఆ ప్రేమని ఆవిడ దాచుకోదు కూడాను.

'మొఖమూ, కాళ్ళూ చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకో అమ్మాయ్, తెల్లారాక తలంటి పోసుకుందువుగాని. కాస్త హార్లిక్సు కలుపుతాను.

రెండుపళ్ళు తిను, పాపం ఎప్పుడు అన్నం తిన్నావో!' అంది ఆప్యాయంగా శ్యామలతో.

శ్యామల వద్దన్నా వినక, హార్లిక్సు కలిపి, పళ్లు వొలిచి పెట్టింది. శ్యామల పక్క, తన పక్క పక్కన వేసింది. శ్యామలని ఆవిడ ప్రశ్నలు ఏమీ వెయ్యలేదు. అర్ధరాత్రి తీసుకొచ్చిన పిల్లనుగురించి కొడుకుని గూడా ఏమీ అడగలేదు. శ్యామల పక్కమీద పరిగిందో లేదో వొళ్లు తెలియకుండా నిద్దరపోయింది. శేఖరం శ్యామలనుగురించి ఆలోచించి, అలా ఆలోచించగూడదని, తనని తను సందలించుకుని నిద్రపోయాడు. కొడుకు ఏ పరిస్థితుల్లో ఆ అమ్మాయిని తీసుకొచ్చినా, వచ్చినపిల్ల మర్యాదస్తుల అమ్మాయి, కాస్త చదువు సంధ్యా కలదీ.—అని గ్రహించుకుంది తల్లి.

*　　*　　*　　*

శేఖరం బి. ఎ. చదువుతూండగా వాళ్ళనాన్న గారు పోయారు. ఆయనకు లేక లేక కలిగిన సంతానం శేఖరం. తండ్రిపోయాక చదువూ సంధ్యా అక్కడితో కట్టిపెట్టి, తండ్రికి వున్న బట్టలకొట్టూ, ఆయిల్ మిల్లూ చూసుకుంటున్నాడు నాలుగైదేళ్ళబట్టీ. తండ్రి చనిపోక మునుపు రెండుమూడు పెళ్లి సంబంధాలువచ్చాయి. అవి స్థిరపడక పూర్వమే ఆయన పోవడం జరిగింది.

మొదటినుంచీ శేఖరానికి తల్లి అంటే ఎంతో ప్రేమ. తనకి అలాటితల్లి పూర్వజన్మసుకృతంవల్ల లభించిందని అనుకునేవాడు. తల్లిని విపరీతంగా ఆరాధించే శేఖరం, ఏ స్త్రీనీ ప్రేమించలేకపోయాడు. ఏ అమ్మాయి అయినా తటస్తపడ్డా, ఆమెలో తన తల్లిలో వున్న గుణగణాదులు లేవని నిరుత్సాహపడి, తనికి పెళ్ళొవద్దని పట్టుబడుతూ వచ్చాడు.

మొదట్లో కొడుకుకు తనమీద వున్న గౌరవానికి ఆమె పొంగిపోయినా, రానురాను తనకొడుకు జీవితంలో ఏదోలోపం ఏర్పడుతోందని బాధపట్టుకుంది. పోనీ, కాలేజీలోనైనా చదువుతూంటే ఏక్లాసుమేట్ నో పెండ్లాడివుండును. చదువు అయిపోడంతో, బట్టలకొట్టుకి అకౌంట్ చూసుకునేందుకు వెళ్ళడం; వెళితే మిల్ కీ, లేకపోతే యిల్లూ రేడియో. సాయంత్రంవేళ సినిమాకో, లేక తల్లిని తీసుకుని బీచికో—ఇదీ అతని కార్యక్రమం.

అతనికి ఆడవాళ్లతో అట్టే పరిచయం లేదు. అసలు ఆడవాళ్లంటేనే కాస్త జంకు. అది బయటికి కనపడకుండా, ఏదో వాళ్లని లెక్క చెయ్యనట్లు మాట్లాడటం అలవరచుకున్నాడు. తల్లికి యీ విషయం బాగా ఆకళింపుకు వచ్చింది. అందువల్లనే మామూలుగా వచ్చే సంబంధాలకి కొడుకు లొంగడనీ, అతనికన్న రెండాకులు ఎక్కువ చదివిన పిల్ల అయితే, పెళ్ళికి వప్పుకుంటాడనీ ఆమె వుద్దేశం. ఉన్న సిరిసంపదలు అనుభవించేందుకు ఒక చక్కని కోడలు కావాలని ఆమె కోర్కె. శ్యామలని చూస్తే ఆవిడ కెందుకో చాలా అభిమానం, జాలీ కలిగాయి.

*　　*　　*　　*

తెల్లవారి శేఖరం నిద్దర లేవడానికి ముందే శ్యామల తను వచ్చిన పనేమిటో కథ యావత్తూ తల్లికి చెప్పింది. తను వెళ్లి తనపాట్లు పడతాననీ, అతను లేవకమునుపే వెళ్ళిపోవడం మంచిదనీ చెప్పింది.

శ్యామల సినిమాల్లో జేరేందుకు వచ్చిందని విన్న శేఖరంతల్లి క్షణకాలంపాటు నిర్ఘాంతపోయింది. కాని తనను తాను సంబాళించుకుని అంది.

'దానికేం—అబ్బాయి వెంట వస్తాడు. వెళ్లి మాట్లాడిరండి. నువ్వు దీనికోసం యింట్లోంచి వెళ్లిపోవాలా ఏమిటి? నీకు ఒక వేషం, యింత డబ్బు, అని స్థిరపడేదాకా యిక్కడే వుండు. ఆపైన యీ చుట్టుపక్కలే మరో యిల్లు వెతుకుదాం,' అంది నవ్వుతూ.

'అయ్యొ బాబోయ్. మీ అబ్బాయి వెంట వొద్దు బాబూ! ఆయన కివి గిట్టవనుకుంటాను. నేనొక్కదాన్నే వెళ్లివస్తాను,' అంది శ్యామల.

'చూడు, నువ్వు చిన్నదానివి. నే చెప్పినట్టు విను. వాడు మిల్లుకి వెళ్లేముందు నిన్ను తీసుకెళ్తాడు. పని అయిపోతే వెంటనే వెనక్కి తెచ్చి దిగవిడుస్తాడు. లేకపోతే భోజనానికి వచ్చేటప్పుడు తీసుకొస్తాడు. వేడినీళ్లు చల్లారిపోతాయి. తొందరగా స్నానంచేసి రా' అంది శేఖరం తల్లి.

శ్యామల మారు మాటాడకుండా బాత్ రూమ్ లోకి వెళ్లిపోయింది.

తల్లి ఏం చెప్పిందో ఏమోకాని, శేఖరం శ్యామలకి లెక్చర్లు యివ్వకుండా, వేళాకోళం చెయ్యకుండా తీసుకెళ్ళాడు. పదిగంటలకి, అంటే వారు వెళ్ళిన అరగంటకి, డైరెక్టరుగారు దర్శనం యిచ్చారు. ఈమాటా ఆమాటా అయాక, 'నీ కెందుకమ్మాయీ సినిమాలు—హాయిగా చదువుకున్నదానివి మరొక వుద్యోగం చేసుకోక!' అన్నారా డైరక్టరుగారు.

'ఈ సలహాకోసం నేను మూడ్రోండల మైళ్ళు రాలేదు. క్రిందటిసారి మీరే చెప్పేరిగా నాలో నటికి కావలసిన లక్షణాలు వున్నాయని. మళ్ళీ మీరే వద్దంటూ రేమిటి?' అంది శ్యామల.

శేఖరం సోఫాలో కూచుని అన్నీ వింటున్నాడు. ఆఫీసు మహా హడావుడిగా వుంది. వాళ్లకి కాఫీలు తెప్పించారు. వచ్చేజనం, పోయేజనం. ఎవరు ఎవరికోసం వస్తున్నారో, అంతుపట్టడంలేదు. పక్క గదిలోంచి నవ్వులూ, మేడమీంచి పాటలూ, తాళాల చప్పుడూ. రిహార్సల్సు కాబోలు అనుకున్నాడు శేఖరం.

'ఇప్పుడుమటుకు నీలో ఆ లక్షణాలు లేవని అంటున్నానా? ఎటొచ్చీ యీ వాతావరణం నీకు సరిపడదేమోనని అనుమానం. అయినా ఈరాత్రి, రేపురాత్రి షూటింగ్ వుంది, వచ్చి చూడు. వర్క్ ఎలావుండేదీ తెలుస్తుంది. మేకప్ టెస్టూ, వాయిస్ ఏమీ యిబ్బంది లేదు. పెద్ద పోర్షను కాదు. చాలా చిన్నది మాత్రమే యివ్వగలను. ఐనా అది తర్వాత చూసుకుందాం. మీరు కూడా ఆమె వెంట రండి,' అన్నాడు డైరెక్టరు శేఖరంతో.

శ్యామలకి యీ పరిస్థితులూ, యీ మనిషి మాటలూ వినగానే సొగం వుత్సాహం హరించిపోయింది అతని ఖర్మమా అంటూ ఎగతాళి చెయ్యకుండా నిశ్శబ్దంగా వున్నాడు శేఖరం దారి పొడుగునా.

ఇంటికొచ్చి భోజనాలు చేశారు. శేఖరంతల్లి ఏమయిందని ప్రశ్నించలేదు. శ్యామల ఏం జరిగిందో చెప్పలేదు. ఆరాత్రి భోజనాల దగ్గిర శేఖరం తల్లితో అన్నాడు: 'ఈరాత్రి షూటింగ్ చూడటానికి రమ్మనమన్నాడు. శ్యామలని వెంటబెట్టుకు తీసుకువెళ్లి, తీసుకొస్తాను,' అన్నాడు.

'అల్లాగే! వొంటిగా రాత్రిపూట పంపడం మంచిదికాదు.' అంది తల్లి.

పదిగంటలవేళ యిద్దరూ కార్లో బయలుదేరారు. క్రిందటిరోజు రాత్రికీ, యీ రాత్రికి ఎంత తేడా!—అనుకుంది శ్యామల. గడిచినరాత్రి తనకి ముందు వెనకలు అయోమయం. కాని యీరాత్రి శేఖరం తనకి అండగావున్నాడు.

'ఈ డైరెక్టరు నీకెలా తెలుసు?'

'పోయిన ఏడు నా స్నేహితురాలింట్లో దిగాడు. మూడురోజులున్నాడు వాళ్లింట్లో. అపుడు పరిచయం అయింది. తను తియ్యబోయే పిక్చరుకి నన్ను హీరోయిన్‌గా తీసుకుంటానన్నాడు,' అంది శ్యామల.

'అతని మాటలు నమ్మి వచ్చావా?'

'పూర్తిగా అతని మాటలే కాదు. పరిస్థితుల వత్తిడి కూడాను...' అని ఆగిపోయింది.

అవి ఎలాటి పరిస్థితులో అతను అడగ లేదు; ఆమె చెప్పలేదు.

కాసేపు అయాక, 'మీ నాన్నగారికి నీ క్షేమం తెలియబరుస్తే మంచిది కాదూ! మీవాళ్లు పోలీసు రిపోర్టుగాని యిస్తారేమో...ఆతర్వాత చిక్కులు...'

'ఈ సినిమా వ్యవహారం తేలితేగాని ఏ సంగతీ నిశ్చయం చేసుకోను. దయచేసి ఆ విషయాలు ఎత్తకండి,' అంది శ్యామల.

ఇద్దరూ స్టుడియోస్‌లోకి వెళ్లారు. డైరెక్టరుగారు వీరికి రెండు కుర్చీలు వేయించారు. అదేదో జానపదచిత్రం సెట్టింగ్. ఏ యింద్రసభో, రావణసభో—అని అనుకున్నాడు శేఖరం. ఈ రెంటిలోని భేదాల్ని తెలుసుకునే అంత సినిమా పరిజ్ఞానం అతనికి లేదు.

సెట్‌మీద ఒక వందమంది ఆడపిల్లలూ, ఒక యాభైమంది మొగవాళ్లూ వున్నారు. అందరి ముఖాలకీ రంగులు పులిమారు. చెమ్కీబట్టలూ, కిరీటాలూ అన్నీ వున్నాయి. మొత్తంమీద దీపాల వెలుతురులో స్టుడియో కళకళల్లాడుతూ వుంది.

శ్యామల వుత్సాహంగా చూస్తోంది చుట్టూ. ఇంతలో హీరోయిన్ వచ్చిందంటే వచ్చిందన్నారు. ఎక్కడి దక్కడ వదిలేసి అటువైపు పరుగెత్తారు కొందరు.

పకొక్క గంట కూచున్నాక, హీరోయిన్ మేకప్ చేసుకు, సెట్‌మీది కొచ్చింది. ఈ లోపల రెండుసార్లు అందరికీ టీ వచ్చింది.

డైలాగ్ మొదలెట్టారు. మనుషులు, కేకలు, అరుపులు, హీరోయిన్ నవ్వులు. ఇంతలోకే ఎవరో ఎక్‌స్ట్రా అమ్మాయి కాబోలు, సరిగా చెయ్యలేదని డైరెక్టరుగారు కొస్త గదమాయించారు. ఆ అమ్మాయి అక్కడే పెద్దపెట్టున రాగాలు మొదలెట్టింది.

పన్నెండు దాటాక శ్యామల తలనెప్పిగా వుందని లేచింది. ఇద్దరూ డైరెక్టరుగారివద్ద శలవు తీసుకు యింటికి బయలుదేరారు. దారిలో ఒక్కరూ మాట్లాడలేదు.

రెండోరోజు రాత్రి కూడా యథాప్రకారం శ్యామలని వెంటబెట్టుకెళ్లాడు శేఖరం.

క్రిందటిరోజుకుమల్లే కాక ఆనాడు సెట్ ఎంతో నిశ్శబ్దంగావుంది. నలుగురు ఆర్టిస్టులుమటు కున్నారు. సెట్‌మీద వర్క్ మొదలెట్టారు. చెప్పినమాటే పదిసార్లు చెప్పించడం, చేసిన యాక్షనే డజనుసార్లు చేయించడం, యీలోపల క్లోజ్, కట్, యిలాటివాటితో తెల్లారి నాలుగింటికి, నాలుగు డైలాగ్సు అయాయి. కాకులు అరుస్తున్నాయి కనక కాల్‌షీట్ అయిపోయిం దన్నారు. హీరోయిన్ తన కారులో వెళ్లిపోయింది. అందరూ తలో కార్లో వెళ్ళిపోయారు.

శేఖరం డైరెక్టరుగార్కి లిఫ్టిచ్చాడు.

'మాశావుగా అమ్మాయి, యిదీ వరస! వేలు గుమ్మరిస్తేగాని పెద్ద తారలురారు. వాళ్ళని పెట్టు కుంటేగాని డిస్ట్రిబ్యూటర్సు డబ్బులు యివ్వరు. ఇంతా అయి, ఒక యేడాదిదాకా నానా తిప్పలూబడి పిక్చరుతీస్తే, అది బాగాలేదని పత్రికల వాళ్లు గిలికేస్తారు, ప్రజలు చప్పరిస్తారు. సినిమా లోకం అంతా యింతే. ఇదొక పద్మవ్యూహం. లోపలికి రావడమేకాని బయటికిపోవడం లేదు. నువ్వు చదువుకున్నదానివి, మంచి కుటుంబంలో నుంచివచ్చిన దానివి కాబట్టి, యిన్నివిధాల చెప్తు న్నాను. సామ్యం తెచ్చానుకోకు. నిన్న కనపడ్డ పిల్లలందరూ నీలాటి ఆశలతో పట్నంవచ్చినవారే! కాని వాళ్ళకి చదువు లేదు, నీకు చదువు వుంది. కాదు కూడదంటే ఏదో చిన్న వేషం యిప్పిస్తాను. కాని, నీకెందుకమ్మా యిది! మీరుగూడా ఆలో చించి ఆమెకి సలహా చెప్పండి, మేష్టారూ!' అంటూ తనయింటిగుమ్మందగ్గిర దిగిపోయాడు డైరెక్టరు.

శ్యామలగానీ శేఖరంగానీ ఏమీ మాట్లాడ లేదు. శ్యామలని మాస్తే శేఖరానికి జాలివేసింది. పాపం! ఆమె ఆశాసౌధాలు యింత లేతవయసులో కూలిపోయాయి. కదా!

మాటలకన్నా నిశ్శబ్దమే ఎక్కువగా వోదా ర్చింది శ్యామలని. ఆ రాత్రి శ్యామల ఏమీ ఆలో చించ దలచుకోలేదు. తెల్లవారి మాసుకో వచ్చు ననుకుంది. ఎందుకో శేఖరంతల్లి పక్కన కూచోవాలనీ, మనసులో మాటలన్నీ తెల్లవారి చెప్పి వెయ్యాలనీ అనుకుంది.

* * * *

తెల్లవారి శేఖరం మిల్లుకి వెళ్లాడు. ఆ మధ్యాహ్నం శ్యామల తను డైరెక్టరుగారింటికి వెళ్ళే అవసరం లేదని చెప్పగానే, తల్లీ కొడుకుల కళ్లలో ఏదో తృప్తీ, ఆనందం మెరిశాయి.

'స్కూల్ ఫైనలు పాసయ్యాను. యింటరు పరి క్షకు కూడా వెళ్ళానాయను. ఏ క్లర్కు వుద్యోగం అన్నా దొరకదూ—మీరు చెప్పండి, మీ అబ్బాయి వెతికిపెడతారు,' అంది శ్యామల శేఖరం తల్లితో, అతను యింట్లో లేకుండా మాసి.

'అయితే సినిమాప్రయత్నం విరమించుకున్నా వన్నమాట?'

'ఆ'

'వుద్యోగం ఎందుకమ్మా నీకు?'

'మళ్లీ మావాళ్లకి నా ముఖం మాపించాలని లేదు. యిక్కడే వుద్యోగంచేసి సంపాయించుకుందా మని,' అంది శ్యామల, శేఖరం తల్లి మాపుని తప్పిం చుకుంటూ.

'చెప్పకుండా రావడమేనా నువ్వు చేసిన పొర బాటు?'

'మీకు తెలుసా?'

'గ్రహించుకున్నాను. మీ నాన్నగారికి నేను వుత్తరం రాసి తెప్పిస్తాను. లక్షణంగా యింటికెళ్లి చదువుకో. యింత చిన్నప్పుడే నీకు వుద్యోగం సద్యోగం ఎందుకు చెప్పు?' అంది శేఖరం తల్లి.

'నేను తిరిగి వెళ్ళనుగాక వెళ్ళను.'

'ఏం?'

శ్యామల మాట్లాడలేదు.

'మీ నాన్న నిన్ను పల్లెత్తుమాట అనకుండా నేను మాస్తాను. యిరవైఏళ్ళన్నా నిండలేదు, నీకు వుద్యోగం ఏమిటి! చక్కగా పెళ్లిపేరంటం చేసు కుని కాపరం చెయ్యాలిగాని!' అంది శేఖరం తల్లి చిరునవ్వుతో.

'వెడితే, ఆపనే చేస్తారు మావాళ్ళు.'

'ఏం?'

'నాకు ఆ అబ్బాయి యిష్టంలేదు. బి. ఎ. నాలుగుసార్లు పల్టీకొట్టాడు. శుద్ధ మొద్దావతారం. కలెక్టరుగారి కొడుకని ముడిపెడ్తానంటున్నారు నాన్న. అందుకే చెప్పకుండా వచ్చాను,' అంది అసలు రహస్యం వెళ్లగక్కుతూ శ్యామల.

శేఖరం తల్లి కళ్లు తళుక్కున మెరిశాయి.

'పోస్. దానికేనా యీ ఖంగారు? పోనీ ఆ సంబంధం కాకపోతే, మరో సంబంధం—అంతే గాని వుద్యోగం ఏమిటి? బంగారుబొమ్మలా వున్నావు, కళ్ళకద్దుకు చేసుకుంటారు ఎవరన్నా నిన్ను. మీ నాన్నగారి ఎడ్రసూ అదీ యిస్తే, నేను యిస్తాను వైర్, రమ్మని. నువ్వు లేకుండా అన్ని విషయాలు మాట్లాడి, చక్కబరిచి మరీ, నిన్ను వెంటబంపుతాను. సరేనా? నీ తర్వాత చెల్లెళ్ళూ, తమ్ముళ్లూ వున్నారంటున్నావు. నీమూలాన వాళ్లు అల్లరిబడితే ఎల్లా చెప్పు? అసలు యీపాటికి పోలీసు రిపోర్టు యివ్వకుండా వుంటారా—నలుగురు నోట్లో పడకుండా గప్ చిప్ గా వెదుకుదు గాని మీవూరు. ఏమంటావు?' అంది శేఖరం తల్లి.

'మీ యిష్టం' అంది శ్యామల తల వంచుకుని.

ఆ సాయంత్రం శేఖరం శ్యామలా డాబాలో కూచున్నారు. తల్లి కిందనుండి ఏదో పని చూసుకుంటోంది.

'మీ అమ్మగారు—మా నాన్నకి వుత్తరం రాస్తానంటున్నారు,' అంది శ్యామల.

'ఇప్పటికన్నా నీకు కళ్ళు తెరుపులకి వచ్చినందుకు సంతోషం. అది మొన్న పొద్దుట చెయ్యాల్సిన పని. అసలు నాకు యిన్నాళ్ళు ఆగటం యిష్టం లేదు. అమ్మ నీ కష్టోడియన్ కాబట్టి వూరుకున్నాను. లేకపోతే యీపాటికి అడ్రసు రాబట్టకుండా వుండే వాడినా?'

'అక్కడ మా నాన్న లెక్చర్లు తప్పించుకు నేందుకు యిక్కడికొస్తే, యిక్కడ మీ లెక్చర్లా? బాగుంది. లెక్చర్లు ఈ జన్మకి తప్పేటట్టు లేవు నాకు. సరే, ఆ మాట అల్లా వుంచండి. మా వూరు తిరిగి వెళ్తాను—ఒక షరతుమీద...'

'అది మీ నాన్నకు చెప్పు. నా కెందుకు?'

'మీరు మా నాన్నకి లెక్చరిస్తారని'

'బాగుంది వరస. ఏమిటా షరతు?'

'ఆ నిశ్చయమైన సంబంధం చేసుకోమని నిర్బంధించకుండా వుండేపక్షంలో, వెనక్కి వెడతాను. లేకపోతే...'

'ఆ—లేకపోతే ??'

'అదంతా మీ కనవసరం'

*　　*　　*　　*

మర్నాటి మెయిల్లో దిగాడు స్కూళ్ళ యిన స్పెక్టరు, శ్యామలతండ్రి. కూతురు వెళ్లిపోయినప్పటి నుంచీ తల్లి మంచం దిగటం లేదుట. కూతురికోసం అహర్నిశలూ ఏడుస్తోందిట.

ఆయన వచ్చీ రాగానే కూతుర్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నాడు. యాభైఏళ్ళవాడు, ఇంకా అయిదేళ్ళ సర్వీసు మాత్రమే వుంది ఆయనకి.

శేఖరం, శ్యామలా లోపలికి తప్పుకున్న తర్వాత, శేఖరం తల్లి అందుకుంది. 'మీ అమ్మాయి వుద్యోగం చేస్తానని పట్టుబడితే, నేను బతిమిలాడి వప్పించాను, మీ వెంట పంపేందుకు'

'మీ మేలు జన్మలో మర్చిపోలేను. అది చాలా తెలివిగలది, బుద్ధిమంతురాలూను. యిలా తొందరబడి ఎందుకు చేసిందో తెలియకుండా వుంది.'

'అయిపోయినవి తవ్వడం ఎందుకు. యింక ఆ పెళ్ళిమాట ఎత్తనని మీరు మాట యిస్తే, వెంట పంపుతాను. లేకపోతే యిక్కడే వుంటుంది. నాకు కూతురులేని కొరత వుండదు.'

శ్యామల తండ్రి ఆమె వంక నిర్ఘాంతపోయి చూశాడు.

'సరే. యింక ఆ పెళ్లిమాట వదిలేస్తాను. మరి, మీ అబ్బాయికి యింకా పెళ్ళికాలేదేమండీ!'

'వాడికి నచ్చిన అమ్మాయి దొరక్క!'

'అల్లాగా...' అన్నాడు స్కూళ్ళ యిన స్పెక్టరు.

ఆరాత్రి శ్యామల తండ్రివెంట మెయిలులో బయలుదేరింది. బయలుదేరేముందు మేడమీద నిల్చుని వుండగా, శేఖరం తల్లి శ్యామల గడ్డంకింద చెయ్యేసి, మొఖం పైకెత్తి 'మీ నాన్న ఆడినమాట యింక తప్పరు. ఐనా తొందరలోనే మాయింటి కొచ్చేస్తున్నావుగా—' అంది.

ఆపక్కనే తచ్చాడుతున్న శేఖరం—'వస్తే వచ్చావుగాని, రాత్రి పదిగంటల వేళ మటుకు టెలిఫోన్ చెయ్యకు. లక్షణంగా మెయిలు ఎక్కి సూర్యోదయంతోపాటు నువ్వు రావచ్చును. చిల్లరయిబ్బంది కూడా వుండదు,' అన్నాడు శేఖరం వేళాకోళం చేస్తూ.

నెల తిరక్కుండా అత్తవారింట్లో పాదం పెట్టింది శ్యామల.

* * * *

శ్యామల పెళ్ళిఅయి అయిదేళ్ళయింది. వారికి మూడేళ్లపాప — బేబీని ఆడిస్తూ శేఖరం 'పాపం — మీ అమ్మ పెద్దతార అవవలసింది, వెంట్రుకవాసిలో తప్పిపోయింది. నువ్వన్నా మీ అమ్మ ఆశయం నెరవేర్చాలి' అని ఎగరేసి ఎత్తుకుంటాడు.

శ్యామల యింకా వుడుక్కుంటూనే వుంటుంది. తల్లిమటుకు శేఖరాన్ని తిట్టి, కోడల్ని వెనకేసుకొస్తుంది.

---

# సుహృద్గీత ★

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

హిమ సస్యంది విభాత పూత సుమనో హేలాత్త మందార మే
ల మనీషీ! వికసింప - నీ కనులలో? ప్రాభాత వేళా కులా
య మనోజ్ఞాంక విస్రుత ద్విజ వితానాపత్య రావమ్ము లే
ల మనీషీ! నినదింప నీగళములో - రమ్యార్తి వేశంతముల్?
జీవన నీరవాధ్వగ సుశీతల తక్ర సమర్పక ప్రపా
శ్రీవిల సత్కుటీర మిది ప్రేమ యనంగ మనీషి! త్వద్దృగం
తావిల బాష్ప బిందువున, త్వద్గళ గాద్గదికమ్ములోన క్షే
మావృతి నేడు నాహృదయ మంతయు నించె గులాబి తావితో
చల దళినీల వార్షుక నిశాంత పయోద మనోజ్ఞ మాలికా
గళితసుధా ప్రవేణికల గాంచి, లతా త్రుటిత ప్రసూన మా
లల గని, నిత్య యాత్రిక విరామ విహీన సదాస్రవన్నదీ
జలముల గాంచి జాలిపడు సౌహృదశాలి! నిను న్నుతించెదన్
ప్రేమ విచిత్ర భావము; మిళింద పదాహతి మాత్ర జాత మ
ల్లీ మకరంద పేశలము; ప్రీత చకోర గళామృతాయ మా
నామల చంద్రికా మధుర; మద్భుత రూప; మలౌకికమ్ము; నీ
వై మలినీకరింప దగునా మన ప్రేమను బాష్ప దిగ్ధతన్?
హృదయ విదారకమ్ము నిజమే! సుహృదావళితో వియోగ మ
న్నది, తటిదంగనా క్షణ సమాగమ లబ్ధ వియోగ మెంచి అం
బుద బుధు డంతలో కరగిపోవు - నిజమ్మె, మనీషి! కాని, ఈ
హృదయ వియోగ యోగ దశలేక నదీ తటయుగ్మమే సఖా!

---